ప్రజాశక్తి

బుధవారం 4 జనవరి 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

తరుముకొస్తున్న పరీక్షలు



తాడికొండ మండలంలో రావెల పాఠశాలను సందర్శనలో గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి శైలజ

- బోధనలో వెంటాడుతున్న సమస్యలు
- పోస్టుల భర్తీపై స్పష్టత కరువు
- ఆందోళనలో పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పదో తరగతి పరీక్షలు తరముకొస్తున్నా ఇప్పటి వరకు సిలబస్ పూర్తి కాకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆందోళనతో ఉన్నారు. విద్యా సంవత్సరం ఆలస్యంగా ప్రారంభం కావడం, నూతన విద్యావిధానమంటూ పాఠశాలల్లో 3,4,5 తరగతుల విలీనంతో చెలరేగిన గందరగోళం, ఉపాధ్యాయుల కొరత, బదిలీలు, ప్రమోషన్లలో జాప్యం తదితర అంశాలతో ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు అనేక సమస్యలు ఎదురయ్యాయి. పలు సమస్యలతో ఉపాధ్యాయులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రధానంగా ఉన్నత పాఠశాలలో పోస్టుల సర్దుబాటైనా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిలో లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు కొరత వెంటాడుతోంది. కొన్ని పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్స్ ఎక్కువ ఖాళీలు ఉండగా ఎస్‌జిటి ఉపాధ్యాయులతోనే బోధన కొనసాగిస్తున్నారు. కొన్ని పాఠశాలల్ల సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉండగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే వారితోనే తాత్కాలికంగా బోధిస్తున్నారు. ప్రస్తుతం హైకోర్టు స్టే వల్ల ఉపాధ్యాయుల బదిలీలు నిలిచిపోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5672 మంది బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2112 మంది ఉపాధ్యాయులు బదిలీ తప్పనిసరని తేల్చారు. జిల్లా వ్యాప్తంగా 3361 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిసింది.

జనవరి చివరి నాటికి దాదాపుగా సిలబస్ పూర్తి చేసుకుని పునశ్చరణ తరగతులు నిర్వహించాల్సి ఉండగా ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో ఇంకా 70 శాతం

▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హెనిక్రిస్టినా, హాజరైన సభ్యులు

రూ.61.26 కోట్లతో జెడ్‌పి బడ్జెట్

- 2023-24 బడ్జెట్ అంచనాలకు స్థాయి సంఘాలు ఆమోదం
- సంక్రాంతి తర్వాత టెన్త్ విద్యార్థులకు అల్పాహారం
- జెడ్‌పి చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా
- టీచర్లను బోధనకే పరిమితం చేయాలి : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా పరిషత్ 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలకు జెడ్‌పి స్థాయి సంఘాలు ఆమోదం తెలిపాయి. జెడ్‌పి కార్యాలయంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన మంగళవారం జరిగిన ప్రణాళిక, ఆర్థిక అంశాలకు సంబంధించిన 1వ స్థాయి సంఘ సమావేశంలో ఈ మేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్‌కు, రాబోయే ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. రూ.61,26,56,000 ఆదాయం, రూ.60,85,85,000 ఖర్చులుగా, రూ.40,71000 మిగులు బడ్జెట్‌తో అంచనాలు రూపొందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.53,14,06000 ఆదాయం, రూ.52,77,50,000 ఖర్చులు, రూ.36,56,000 మిగులు బడ్జెట్‌ను ఆమోదం తెలిపారు. ప్రస్తుత బడ్టెట్ కంటే రాబోయే ఆర్థిక సంవత్సరంలో సర్‌ఛార్జ్ స్టాంప్ డ్యూటీ, ఇసుక సీనరేజ్, భూమి కౌళ్లు, రేవుల ఆదాయం, భవనాలు, షాపుల అద్దెల ద్వారా రూ.2.22 కోట్లు వరకూ ఆదాయం పెరుగుతుందని అంచనా వేశారు. ఈ సందర్భంగా హెనీక్రిస్టినా మాట్లాడుతూ గతంలో నిధులు

▶ 2లో

కానుకల ఎరతో చంద్రబాబు సభ

మంత్రులు రాంబాబు, నాగార్జున, రజిని, విమర్శలు 2లో

గుంటూరు జిల్లా ప్రతినిధులు



భీమవరంలో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభలో నివేదిక, ఇతర అంశాలపై రెండు జిల్లాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు.



పల్నాడు జిల్లా ప్రతినిధులు

ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి

- లే అవుట్లలో మౌలిక వసతులు కల్పించాలి
- ఇళ్ల నిర్మాణం, కేటాయింపు, పింఛన్ల తొలగింపుపై 7-13 తేదీల్లో విస్తృతంగా సర్వే
- సమస్యలు పరిష్కారం అయ్యేదాక ఆందోళనలు
- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- నాగులపాడు లే అవుట్ వద్ద పరిశీలన



2 లో

నాగులపాడులో స్థలాలను పంపిణీ చేసిన లే అవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు



8లో

అవార్డులు అందుకున్న ఉపాధ్యాయినులతో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, వి.లక్ష్మణరెడ్డి తదితరులు

బాలికా విద్యను ప్రోత్సహించాలి

సావిత్రిబాయి పూలే ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ సభలో వక్తలు

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు

వార్తలు లోపలి పేజీల్లో

ఆర్‌టిసి సంక్రాంతి రిజర్వేషన్లు 2లో

ఆర్‌టిసి సంక్రాంతి రిజర్వేషన్లు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి జిల్లాలోని ప్రధాన డిపోలకు 132 బస్సులకు ముందస్తు రిజర్వేషన్ ఇస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి విజయగీత మంగళవారం తెలిపారు. సుఖప్రదమైన, భద్రతతో కూడిన సౌకర్యాన్ని ఆర్‌టిసి అందిస్తోందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. బెంగుళూరు నుంచి 6, చెన్నై నుంచి 4 ప్రత్యేక బస్సులను ముందస్తు రిజర్వేషన్ కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదారాబాద్ నుంచి గుంటూరు, పొన్నూరు, మంగళగిరి, తెనాలి పట్టణాలకు ఈనెల 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రిజర్వేషను సౌకర్యం ఉందన్నారు. గుంటూరు, పొన్నూరు, తెనాలి, మంగళగిరి నుంచి ఈనెల 16, 17, 18 తేదీల్లో రిజర్వేషన్లు ఉంటాయని, వివిధ బస్ స్టేషన్ల నుండి హైదరాబాద్‌కు 106 బస్సులు ఉంటాయని వివరించారు.

రోడ్డు విస్తరణ బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలి

ప్రజాశక్తి - వినుకొండ

రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించాలని ఎఐసిసిటియు నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో రోడ్ల విస్తరణ త్వరలో చేపట్టనున్న దృష్ట్యా రోడ్ల పక్కన చేతి పనులు చేసుకుంటూ జీవిస్తున్న వారికి ఇబ్బందులు కలగనున్నాయన్నారు. రోడ్ల పక్కన మోటార్ మెకానిక్, గ్యాస్ వెల్డింగ్, ఆటోలు, చిరు వ్యాపారులు, ఇతర చేతి వృత్తులు చేసుకుంటూ అనేకమంది జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. వీరికి ప్రత్యామ్నాయం చూపాకే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. పట్టణ అభివృద్ధిని దష్టిలో పెట్టుకొని ప్రత్యేకమైన ఆటోనగర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.పట్టణ అధ్యక్షులు భాస్కర్, కార్యదర్శి ఫిరోజ్, ప్రసాద్, నాగాంజనేయులు, సుభాని పాల్గొన్నారు.

రూ.61.26 కోట్లతో జెడ్‌పి బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించని మండలాలకు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.10 లక్షల చొప్పున కేటాయించినట్లు చెప్పారు. ఛైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన 4వ స్థాయి సంఘ సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని పదో తరగతి విద్యార్థులకు ఈసారి ముందుగానే స్టడీ మెటీరియల్ అందించటానికి కృషి చేసిన ఛైర్‌పర్సన్‌కు అభినందనలు తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ నుండి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో వాటికి సిద్ధమవుతున్న విద్యార్థులకు సంక్రాంతి తర్వాత నుండి అల్పాహారం అందించాలని కోరారు. అందుకు చర్యలు తీసుకుంటామని ఛైర్‌పర్సన్ చెప్పారు. డిఇఒ కార్యాలయాల్లో ఇంకా ఎక్కడైనా ఉపాధ్యాయులు బోధనకు దూరంగా, ఓడీపై పని చేస్తుంటే వారందర్నీ తిరిగి పాఠశాలలకు పంపించాలని కెఎస్ లక్ష్మణరావు కోరారు. మూడేళ్లుగా మున్నంగి జెడ్‌పి హైస్కూల్లో గణిత ఉపాధ్యాయులు ఓడీపై లైబ్రరీ శాఖలో పనిచేస్తున్నారని, పాఠాలు బోధించాల్సిన వారు ఈ విధంగా ఓడీలపై ఉంటే ఎలాగని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన పథకంలో లావు బియ్యం సరఫరా చేయటం వల్ల సగానికి పైగా విద్యార్థులు భోజనాన్ని ఇష్టపడట్లేదని లక్ష్మణరావు తెలిపారు. ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేయాలని సూచించారు. పిహెచ్‌సిల్లో స్టాఫ్ నర్సులు, సిబ్బంది కొరత తీర్చాలని, పరికరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని భట్టిప్రోలు, ఈపూరు జెడ్‌పిటిసిలు కోరారు. భట్టిప్రోలు జెడ్‌పిటిసి గతంలో అనేక సార్లు భట్టిప్రోలు పిహెచ్‌సి అధ్వాన్నంగా ఉందని సమావేశాల్లో అధికారుల దృష్టికి తెచ్చినా అధికారులు స్పందించకపోవటంపై జెడ్పిసిఇఒ, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తదితరులు బాపట్ల డిఎంఅండ్‌హెచ్‌ఒపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే సందర్శించి, సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. 2, 7వ స్థాయి సంఘాల సమావేశం ఛైర్‌పర్సన్ అధ్యక్షతన, 3వ స్థాయి సంఘ సమావేశం వైస్ ఛైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన, 5వ స్థాయి సంఘం తెనాలి జెడ్‌పిటిసి పిల్లి ఉమాప్రణతి అధ్యక్షతన, 6వ స్థాయి సంఘ సమావేశం వైస్ ఛైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన నిర్వహించారు.

ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి

- లే అవుట్లలో మౌలిక వసతులు కల్పించాలి
- ఇళ్ల నిర్మాణం, కేటాయింపు, పింఛన్ల తొలగింపుపై7-13 తేదీల్లో విస్తృతంగా సర్వే
- సమస్యలు పరిష్కారం అయ్యేదాక ఆందోళనలు
- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

నాగులపాడు లే అవుట్ వద్ద పరిశీలన

ప్రజాశక్తి - పెదనందిపాడు

పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించడంతోపాటు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. ఈ అంశాలపై రానున్న శాసన మండలి సమావేశాల్లో తాను ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ చెప్పారు. మండలంలోని నాగులపాడులో లే అవుట్‌ను నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ లే అవుట్లలో మెరకలు తోలాలని, నీరు, విద్యుత్ సదుపాయం, కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చే రూ.1.8 లక్షలు పునాదికి కూడా చాలవన్నారు.

బ్యాంకుల ద్వారా పావలా వడ్డీ రుణాలు ఇప్పించాలని కోరారు. రామారావు మాట్లాడుతూ సిమెంటు ఇనుము, ఇసుక తదితర నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వం పెంచాలని కోరారు. నాగులపాడులో 480 మందికి స్థలాలివ్వగా ఇల్లు నిర్మించుకోలేకపోయారని గుర్తు చేశారు. ఇళ్ల నిర్మాణంతోపాటు టిడ్కో ఇళ్ల పంపిణీలో నెలకొన్న జాప్యం, సామాజిక పింఛన్లలో కోత తదితర అంశాలపై ఈనెల 7-13 తేదీల్లో జిల్లాల్లో విస్తృతంగా సర్వే చేస్తామని ప్రకటించారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేదాకా సిపిఎం పోరాడుతుందని, అందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఆందోళనలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.నాగేశ్వరరావు, మండల కార్యదర్శి డి.రమేష్ బాబు, నాయకులు జె.రామారావు, కె.వెంకటశివరావు, సిహెచ్.యానాదులు, ఎం.రమణ, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను చేరాలంటే కొన్నింటిని త్యాగం చేయాలి

నీటి, ఐఐటి పరీక్షలపై అవగాహనలో పారా లక్ష్మయ్య

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని విశ్వసాయి కళాశాల విద్యార్థులకు నీట్, ఐఐటికి అవగాహన సదస్సు నిర్వహించగా ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ పారా లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవాలంటే కొన్నిటిని త్యాగం చేయాల్సి ఉంటుందన్నారు. సాధించాలన్న తపన ఉంటే సరిపోదని, అదుకు కొన్ని కోరికలను దిగమింగాలని, అప్పుడే లక్ష్యాన్ని చేరుతారని చెప్పారు. దీంతోపాటు తాను ఎదుర్కొన్న, చేసిన ప్రయాణాన్ని ఉదహరించారు. విద్యార్థులు అడిగిన



మాట్లాడుతున్న పారా లక్ష్మయ్య

పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ యడవల్లి శ్రీనివాసుశర్మ, ప్రిన్సిపాల్ యడవల్లి శ్రీవల్లి, భాగవతుల రవికుమార్, వినుకొండ బిఇడి కళాశాల డైరెక్టర్ గాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కానుకల ఎరతో చంద్రబాబు సభ



బాధితురాలితో మాట్లాడుతున్న మంత్రి రజని తదితరులు

మంత్రులు రాంబాబు, నాగార్జున, రజిని, విమర్శలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

చంద్రబాబు సభలకు ప్రజలు రాకపోవడంతో కానుకల పేరిట పేదలకు ఎర వేస్తున్నారని, కనీస జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాలను బలిగొంటున్నారని రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, విడదల రజని విమర్శించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో క్షతగాత్రులను మంగళవారం పరామర్శించినానంతరం వారు మీడియాతో మాట్లాడారు. ప్రజల్లో టిడిపి ఉనికి కోల్పోతోందని, మహిళలు మద్దతు ఇవ్వడం లేదని తెలుసుకుని ఎన్‌టిఆర్ వస్త్రాలు, చంద్రన్న కానుకల పేరుతో ఎర వేశారని ఆరోపించారు. వికాస్ నగర్‌లో ఘటనలో ముగ్గురు చనిపోగా 19 మందికి పైగా గాయపడ్డారని, ఒక్కో మృతురాలి కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున, ఒక్కో క్షగాత్రులు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున ప్రభుత్వ స్వాయం అందించామని చెప్పారు. గాయపడిన వారికి పూర్తిగా వైద్యం అందిన తర్వాత వారిని ఇంటికి పంపిస్తామని మంత్రి రజని అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు అబద్ధపు ప్రచారాలు, మోసపూరిత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గుంటూరులో జరిగిన సభకు టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రవణ్ కుమార్ అనుమతి తీసుకున్నారని, సభకు 10 వేల మంది వస్తున్నారని అనుమతి తీసుకుని, చీరలు, కందిపప్పులు అంటూ పేదల ప్రాణాలు తీస్తారా? అని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదగాలంటే నరబలి ఇవ్వాలని ఎవరో సలహాలిచ్చి ఉండటం వల్లే ఇలాంటి పాపాలకు ఒడిగడుతున్నాడని ఆరోపించారు. పేదలు చనిపోవడానికి ప్రేరేపించేలా చంద్రబాబు చేశారని, దీన్ని సుమోటాగా తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తాను చెప్పినవి అబద్ధాలని చెబితే తన పదవికి రాజనామా చేయడంతోపాటు రాజకీయాల నుండే వైదొలగుతానని సవాల్ విసిరారు. చంద్రబాబు చేసే కుట్రలను కుతంత్రాలను నమ్మొవద్దన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మద్దాలి గిరి, ముస్తాఫా, మేయర్ కావటి మనోహర్ నాయుడు, మార్కెట్ యార్డు ఛైర్మన్ చంద్రగిరి యేసురత్నం, డిప్యూటీ మేయర్‌లు బాలవజ్రబాబు, సజీల, జిల్లా గ్రంథాలయం సంస్థ ఛైర్మన్ బి.దేవానంద్, వైసిపి కేంద్ర మండలి సభ్యులు టి.మురళిమోహన్, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బంగారం, నగదు అపహరణ

ప్రజాశక్తి- తెనాలి

వేసిన తాళం వేసినట్టే ఉన్న ఇంట్లో చోరీ జరిగన సంఘటన పట్టణంలోని నాజర్పేట చెరువువారి వీధిలో మంగళవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాలు ప్రకారం పట్టణంలోని నాజర్పేట చెరువు వారి వీధిలో నివాసం ఉండే రత్నకుమారి సోమవారం బంధువుల ఇంట శుభకార్యానికి హాజరయ్యేందుకు నరసరావుపేట వెళ్ళింది. తిరిగి మంగళవారం ఇంటికి వచ్చి తాళం తీసి చూస్తే ఇల్లంతా గందరగోళంగా ఉంది. బీరువాలు తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చింది. అయితే ఇంటికి తాళం వేసి వెళ్లడంతో ఎవరూ లేరని గుర్తించిన దుండగులు, ఇంటి వెనుక వైపు ఉన్న కిటికీ ఐరన్ గ్రిల్ తొలగించి లోనికి ప్రవేశించారు. రెండు బీరువాలను పగలగొట్టి, బంగారం నగదు అపహరించినట్లు బాధితులు చెబుతున్నారు. పట్టణ వన్ టౌన్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తరుముకొస్తున్న పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

కూడా సిలబస్ పూర్తి కాని పరిస్థితి ఏర్పడింది. ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు శ్రద్ధ చూపిన పాఠశాలల్లో మాత్రం 70 శాతం సిలబస్ పూర్తయినట్టు తెలుస్తోంది. పరీక్షలకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది. జనవరి చివరి కల్లా సిలబస్ పూర్తి చేసుకుని ప్రీ ఫైనల్ పరీక్షలకు సిద్ధం కావాల్సిన విద్యార్థులు ప్రస్తుతం ఇంకా పాఠాలు నేర్చుకునే పనిలో ఉన్నారు. జనవరి మొదటి వారం మొత్తం సమ్మేటివ్-1 పరీక్షలకు, ఆ తరువాత సంక్రాంతి సెలవులతో దాదాపు 18వ తేదీ వరకు బోధనా తరగతులకు అవకాశం లేదు. జనవరిలో మరో 10 రోజులు, ఫిబ్రవరి చివరి కల్లా మొత్తం సిలబస్ పూర్తవుతుందా? లేదా? అనే సమస్య విద్యార్థులను, తలిలదండ్రులను ఆందోళనకు గురి చేస్తోంది. జిల్లాలో చాలా పాఠశాలలో సబ్జెక్టుల వారీగా టీచర్ల సర్ధుబాటు ప్రక్రియకు తీవ్ర జాప్యమైంది. విద్యా సంవత్సరం ప్రారంభం కావడానికి ముందే చేయాల్సిన బదిలీల ప్రక్రియను డిసెంబరులో చేపట్టడం వల్ల చాలా మంది ఉపాధ్యాయులు ఈ అంశంపైనే దృష్టి సారించారు. జిల్లాలో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ప్రక్రియే ప్రారంభం కాలేదు. మరో వైపు బదిలీల తరువాత కొన్ని పాఠశాలల్లో పోస్టులు భర్తీ అవుతాయని భావించినా ఉన్నత పాఠశాలల్లో కీలకమైన సబ్జెక్టుల్లో పూర్తిస్థాయి ఉపాధ్యాయులు వస్తారా? లేదా? అనే సందేహాలూ ఉన్నాయి. విద్యార్థులు పెరిగిన చోట ఉపాధ్యాయులను పెంచడం, తగ్గిన చోట తగ్గించడం తదితర ప్రక్రియలతో బోధనకు ఆటంకం ఏర్పడింది. సబ్జెక్టు టీచర్ల సర్ధుబాటు కూడా సరిగా జరగలేదు. ఇప్పటికీ పల్నాడు జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు రోడ్డెక్కిన పరిస్థితి ఇటీవల గురజాలలో తలెత్తింది. ఖాళీల భర్తీపై ప్రభుత్వం ఇంకా స్పష్టతివ్వలేదు. బదిలీలు, పదోన్నతులు తరువాత స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరంలో సిలబస్ పూర్తి చేయించడం, ఉపాధ్యాయుల సర్ధుబాటు, బదిలీల ప్రక్రియ విద్యాశాఖ అధికారులకు కూడా కత్తిమీద సాములా మారుతోంది.

అర్బన్ హెల్త్ సెంటర్ పరిశీలన


ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నగర పరిధిలోని చినకాకాని జాతీయ రహదారి వెంబడి తుదిదశకు చేరుకున్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణలు అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈనెల 6వ తేదీన ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సుంకర రఘుపతిరావు, నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 16 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - మాచర్ల

నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసు కోవాలని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యా లయంలో మంగళ వారం జరిగిన జాబ్ మేళాను మున్సిపల్ చైర్మన్ బోయ రఘురా మిరెడ్డి, కమిషనర్ ఇవి రమణబాబుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగతను తగ్గించేందుకు పరిశ్రమలకు అవసరమైన స్కిల్స్‌ను నేర్పి ఉపాధి కల్పించేందుకు అన్ని ప్రాంతాల వారిగా జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు వివరించారు. జాబ్ మేళాలో ఉపాధి పొందేందుకు 110 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ కాగా, వారిలో 55 మంది జాబ్ మేళాకు హాజరయ్యారన్నారు. వీరి నుండి 16 మందిని హెటి రో డ్రగ్స్, రేతా ఫైనాన్స్, మేధా సర్వో డ్రైవర్స్ కంపెనీలకు ఎంపికయ్యారని తెలిపారు.



వైసిపిలో ముదురుతున్న విభేదాలు

విమర్శలపై స్పందించిన ఎంపిపి

ప్రజాశక్తి - బెల్లంకొండ

వ్యక్తిగత విషయాల దృష్టిలో పెట్టుకుని పార్టీపై విమర్శలు చేయడం సరికాదని ఎంపిపి చెన్నప్పరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం బెల్లంకొండలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. పాపాయపాలెం మాజీ ప్రజాప్రతినిధులు మర్రి వెంకటరామిరెడ్డి, మర్రి అచ్చిరెడ్డి, ప్రస్తుత జడ్‌పిటిసి గాదె వెంకటరెడ్డి తదితర నాయకులు ఎప్పుడైనా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నిర్వహించిన కార్యక్రమాలు హాజరయ్యారా అని ప్రశ్నించారు. అసమ్మతి ఉంటే మండలంలో అన్నీ గ్రామాల్లో ఉండాలన్నారు. కేవలం ఒక్క గ్రామంలో ఇద్దరు, ముగ్గురు వారి వ్యక్తిగతమైన విషయాల కోసం పార్టీ పై విమర్శలు చేయడం సరికాదని అసలు పార్టీలో ఉన్నారో లేదో తెలియని వారు మాట్లాడటం కుదరదని హెచ్చరించారు. టిడిపిలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తూ ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. మేము తెలంగాణా మద్యం అమ్మడం వాస్తవం అయితే పోలీసులు కేసులు నమోదు చేయాలి కదా అని ప్రశ్నించారు. మట్టి మద్యం అమ్మకాలుంటే నిరూపించాలని సవాల్ చేశారు. జడ్‌పిటిసి అవస్తవాలు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. పాపాయపాలెం ఎంపిటిసి మర్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతు టిడిపి నుండి వచ్చిన వారికి వైసిపిలో ప్రాధాన్యత ఇచ్చామనేది అవాస్తవమని, ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు చేసిన వ్యాఖ్యలకు పార్టీ పెద్దలతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.



పేరేచర్లలో జగనన్న కాలనీలో పరిశీలన

ప్రజాశక్తి-మేడికొండూరు

రాష్ట్రంలోనే ఒక పెద్ద వెంచర్‌గా ఉన్న పేరేచర్ల లోని జగనన్న కాలనీలో కనీస మౌలిక వసతుల రూపకల్పన లేదని, తాడికొండ నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకా విజయకుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల జగనన్న కాలనీలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చిలకా విజయ్ కుమార్ మాట్లాడుతూ అధికారులు, గ్రామ వాలంటీర్లు, అధికార పార్టీ చోటామోటా నాయకులు ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే స్థలాలు లాగేసుకుంటామని, కార్డులు తీసేస్తామని, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను రద్దు చేస్తామని లబ్ధిదారులను బెదిరిస్తున్నారని అన్నారు. ఎవరైనా ఇంటి నిర్మాణాలు చేపట్టాలంటే ఆ ప్రాంతంలో కనీస వసతులు కావాలని, అవేమీ కల్పించకుండా లబ్ధిదారులను బెదిరించడం అన్యాయమన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎలా జరిగిందో, ఇప్పుడున్న అధికార పార్టీ నాయకులు తెలుసుకోవాలన్నారు జగనన్న కాలనీల మౌలిక వసతుల రూపకల్పనకై త్వరలోనే జిల్లా కలెక్టర్‌ను కలిసి వివరిస్తామని విజయ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మన్నవ కిరణ్ కుమార్, జిల్లామైనారిటీ నాయకులు షేక్ హుస్సేన్, మండల మైనార్టీ నాయకులు షేక్ బాషా, యువజన కాంగ్రెస్ నాయకులు షేక్ లియాఖత్ తదితరులు పాల్గొన్నారు

శివనాయక్ మృతికి ఎమ్మెల్యే ఆర్కే నివాళి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం చింతలతండా గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు కేతావత్ చంద్రు కుమారుడు కేతావత్ శివ నాయక్ సోమవారం ఒంగోలులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం చింతలతండాలో శివనాయక్ మృతదేహానికి ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డి నివాళులర్పించి, వారికి అండగా ఉంటామని కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా రూ.10వేల ఆర్థిక సాయం వారికి అందజేశారు.కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపీరెడ్డి, సర్పంచ్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.



స్టీవెన్‌బాబును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రంగస్థల హాస్యనటుడు స్టీవెన్‌బాబుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కళాకారులను ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని ప్రముఖ రంగస్థల హాస్యనటులు పినపాటి స్టీవెన్‌బాబు అన్నారు. స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో మంగళవారం ఎన్టీఆర్ నటించిన శ్రీ మద్విరాటపర్వం చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల్లో భాగంగా స్టీవెన్‌బాబను సత్కరించారు. కార్యక్రమంలో కె.రాజా, ఎం.మనోహర్, కె.జఖరయ్య, కె.రఘునాథ్,ఎస్.నాని, జుగుంట నాగరాజు, ఎం.నరశింమాచారి, ఎం.రాఘవరావు, జగన్, పి.రవీంద్ర, పి.దుర్గా హేమంత్ పాల్గొన్నారు.

బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తెనాలి:

రెండేళ్ల ఐటిఐ డిప్లమో పూర్తిచేసి, పాలిటెక్నిక్ డిప్లమో రెండో ఏడాదిలో ప్రవేశాలు పొందేందుకు బ్రిడ్జి కోర్సు నిర్వహణకు కళాశాలకు అనుమతి లభించినట్లు చినరావూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చినవెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. జనవరి 9 నుంచి ఫిబ్రవరి8 వరకూ జరిగే శిక్షణకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ టెన్త్, ఐటిఐ కోర్సు సర్టిఫికేట్లు, ఆధార్, రెండు పాస్‌పోర్టు ఫోటోలతో ఈనెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కళాశాల పనివేళల్లో 9014491772 నెంబరులోగాని, నేరుగా కళాశాల్లోకాని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఫిబ్రవరి11,12 తేదీల్లో అరసం రాష్ట్ర మహాసభ

పలు పాఠశాలల్లో వివిధ అంశాల్లో పోటీలు

ప్రజాశక్తి-తెనాలి

విద్యార్థుల్లో దేశభక్తిని పెంచేందుకు సామాజిక స్థితిగతులపై అవగాహన కల్పించేందుకు వివిద అంశాల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు అరసం రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘ సభ్యులు ఆచార్యా గుజ్జర్లమూడి కృపాచారి చెప్పారు. మంగళవారం స్థానిక కొత్తపేట సిపిఐ కార్యాలయంలో మంగళవారం అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన సమావేశంలో కృపాచారి మాట్లాడుతు ఫిబ్రవరి 11,12 తేదీల్లో అరసం రాష్ట్ర 19వ మహాసభలు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా స్థానిక తాలూకా జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 21, 22 తేదీల్లో 8 నుంచి 10 తరగతి విద్యార్థులకు కథలు చెప్పటం, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచతంత్ర, చందమామ, బాలమిత్ర, చెకుముకి వంటి పత్రికల్లోకి కథలను ఏడు నిముషాలకు మించకుండా చెప్పాలన్నారు. అలాగే వ్యాసరచనలో 'పుస్తక పఠనం-ప్రయోజనాలు' అంశంపై మూడు పేజీలకు తగ్గకుండా 45 నిముషాల్లో రాయాలన్నారు. వక్తృత్వంలో 'స్వాతంత్రోధ్యమంలో తెనాలి ప్రాముఖ్యత' అంశంపై ఎనిమిది నిముషాల్లో ప్రసంగించాలన్నారు. పోటీల్లో విజేతలకు ప్రతి అంశంలో పథమ రూ.1000, ద్వితీయ 750, తృతీయ రూ.500 బహుమతులు మహాసభలో అందజేస్తామన్నారు. కళాశాల విద్యార్థులకు తెలుగు బాషా సాహిత్యంపై క్విజ్, వ్యాసరచనలో తెనాలి ప్రాంత ఆధునిక రచయితల్లో మీకు నచ్చిన ఒక కథా రచయిత గురించి వ్యాసం, వక్తృత్వంలో గురజాడ దేశభక్తి గేయం-విశిష్టతఅంశంపై ప్రసంగించాలన్నారు. కళాశాల నుంచి ఇరువురు మాత్రమే పాల్గొనాలని, బహుమతులు వరుసగా రూ.1250, రూ.వెయ్యి, రూ.750 అందజేస్తామని తెలిపారు. వివరాలకు 19వ తేదీలోగా 9177174389, 7729971471 నెంబర్లలో ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో సభ్యులు గోగినేని కేశవరావు, షేక్ అబ్దుల్‌హకీం జాని, దేవిశెట్టి కృష్ణారావు, కొండముది రమేష్‌బాబు, వెనిగళ్ళ నారాయణప్రసాద్ పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	40,949
మిర్చి ఎగుమతి	:	39,385
మిర్చి నిల్వ	:	11,558

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000- 26,000
నెం.5	10,000- 24,500
273	15,000 - 23,000
341	10,000 - 25,800
4884	13,500 - 21,000
సూపర్ 10	17,500 - 18,000
నాన్ ఎసి	
తేజ	9,000 - 23,500
బడిగి	11,000 - 27,000
దేవనూరు డీలక్స్	10,000 - 25,500
తాలుకాయలు	4,000- 13,000
ఎసి	
334	25,000 - 26,500
నెం.5	18,000 - 18,000
341	12,,700 - 20,200
తేజ	12,000 - 21,500
బడిగి	12,500 - 26, 000
తాలుకాయలు	4,500- 12,000



కూర్చునే అవకాశమూ లేక ఆశాల అవస్థ

ప్రజాశక్తి - దాచేపల్లి

కనీసం కూర్చోవడానికి కూడా వసతుల్లేక ఆశా కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన దాచేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశాడేలో ఆయన మాట్లాడారు. ఆశాలు గంటల తరబడి నిల్చుని పని చేయాల్సి వస్తోందని, మరుగుదొడ్ల సదుపాయమూ లేక అవస్థ పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యలను ఆశా డే సందర్భంగా అయినా చెబుదామనంటే ఆ అవకాశం కూడా అధికారులు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, ర్యాలీలు, బహిరంగ సభలపై వైసిపి ప్రభుత్వం తెచ్చిన జీవో సరికాదని అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై, హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా చేపట్టిన భూ రీ సర్వే, వివిధ అవసరాల కోసం సేకరించాల్సిన భూ వివరాల సేకరణ, అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన సమీక్షలో జెసి మాట్లాడుతూ పనుల్లో వేగం మరింత పెంచాలని సూచించారు. రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో జరుగుతున్న ప్రభుత్వ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కొందరు అధికారులపై అసహనం వ్యక్తం చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ వసంతబాబు, భూ సర్వే, లాండ్ రికార్డ్స్ ఏడీ నాగశేఖర్, కలెక్టరేట్ ఏవో అనీల్‌కుమార్, ఆర్‌డిఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలను పరిశీలించిన మంత్రి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని 7, 8 వార్డుల్లో ముగ్గుల పోటీలను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మంగళవారం పరిలించారు. కనుమరుగవుతున్న తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు పూర్వ వైభవం తీసుకురావాలనేది ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. అందుకే ప్రతిఏటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ మహిళల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నామన్నారు.



అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి..ముగ్గులను ఆసక్తిగా తిలకించారు. ఆయన వెంట 7, 8 వార్డుల సచివాలయాల కన్వీనర్ ఆర్.రవితేజ, వార్డు ఇన్‌ఛార్జి ఆర్.విజయకుమారి, ఇతర నాయకులున్నారు.



సత్తెనపల్లిలో నివాళులర్పిస్తున్న ఐద్వా, ఇతర సంఘాల నాయకులు



రాజుపాలెం మండలం చౌటపాపాయపాలెం ఆర్ఆర్ సెంటర్లో కెవిపిఎస్ నాయకుల నివాళి

విద్యాజ్యోతి సావిత్రిబాయి పూలే

192వ జయంతి సందర్భంగా పలుచోట్ల ఘన నివాళులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

స్త్రీలకు, అణగారిన వర్గాల వారికి విద్యకోసం సావిత్రిబాయి పూలే తన జీవితాన్నే వెచ్చించారని పలువురు కొనియాడారు. సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఆమె చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. తొలి ఉపాధ్యాయురాలిగా స్త్రీ అభ్యున్నతి, విద్య, వికాసం కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి, ఆ క్రమంలో ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా **సత్తెనపల్లి**లోని పుతుంబాక భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఐద్వా పట్టణ కార్యదర్శి జి.ఉమశ్రీ మాట్లాడారు. సమాజంలో వివక్షతకు, అణచివేతకు, నిర్లక్ష్యానికి, అంటరానితనానికి గురై, చీకటి లోయల్లో కుమిలిపోతున్న అణగారిన వర్గాల, స్త్రీల జీవితాల్లో సావిత్రిబాయి పూలే అక్షర కాంతులను విరజిమ్మారని చెప్పారు. ఆమె ఒక క్రాంతి జ్యోతి అని కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి పి.రజిని, పట్టణ అధ్యక్షులు ఎం.జ్యోతి, నాయకులు డి.విమల, జి.నాగలక్ష్మి, ఐ.అరుణ, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు పి.సూర్యప్రకాశరావు, డివైఎఫ్ఐ నాయకులు జె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా దినోత్సవంగా ప్రకటించాలని జైభీమ్ భారత్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ కన్వీనర్ జొన్నలగడ్డ విజయకుమార్ కోరారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి సభలో సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబ్దుల్ రహీం, శ్రీనివాస్ యాదవ్, ఎం.సుధాకర్, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. **రాజుపాలెం** మండలం చౌటపాపాయపాలెం ఆర్ఆర్ సెంటర్లో సావిత్రిబాయి పూలే జయంతిని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటమే సావిత్రిబాయి పూలేకు నివాళి అని అన్నారు. మహిళలు చదువుకోకూడదు అనేటువంటి వ్యవస్థ కొనసాగుతున్న కాలంలో అందరూ చదువుకోవాలి అని, చదువు ద్వారా విజ్ఞానం వస్తుంది, విజ్ఞానం ఆలోచనలు పెంచుతుంది, తద్వారా చైతన్యం పెరిగి సమాజంలో ఉన్న దురాచారాలను తొలగించుకుంటారనే చైతన్యంతో సావిత్రిబాయి పూలే ఉద్యమించారని చెప్పారు. మను ధర్మ శాస్త్రంలోని దురాచారాలను సమాజంలోకి మళ్లీ తీసుకెళ్లాలని కుట్రలు జరుగుతున్న నేటి తరుణంలో ఆ కుట్రలను సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు ఎస్.దుర్గాభాయి, రమేష్ నాయక్, బాలాజీ నాయక్, దాసు పాల్గొన్నారు. **చిలకలూరిపేటలోని** గడియార స్తంభం వద్దగల సావిత్రిబాయి పూలే విగ్రహానికి మహాత్మా జ్యోతిరావు పూలే చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాలలేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షులు ఉప్పాల భాస్కరరావు, బిసి సంక్షేమ సంఘం నాయకులు ఎం.వెంకటకోటయ్య మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావుపూలేతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్ట మొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారన్నారు. కుల వ్యవస్థకు, పితస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల అస్పృశ్యుల, మహిళల సమాన హక్కుల కోసం పోరాడారని చెప్పారు. జి.నారాయణరావు, కె.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, టి.అప్పారావు, డి.శ్రీనివాసరావు, వి.పుల్లయ్య, జి.పద్మావతి, టి.కాసులు, యు.కోటేశ్వరరావు పాల్గొన్నారు. గణపవరంలోని రాజీవగాంధీ కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, హుస్సేనమ్మ ఎలమందయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో జయంతి సభ నిర్వహించగా ప్రముఖ సాహితీ విమర్శకులు డా.పి.వి.సుబ్బారావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయినులు మల్లీశ్వరి, ఝాన్సీ రాణి, శివకుమారిని సత్కరించారు. హెచ్ఎం ఎ.గురులింగం, జనవిజ్ఞాన వేదిక జిల్లా అద్యక్షులు డి.బుజ్జిబాబు, వాలంటీర్ మాణిక్యమ్మ పాల్గొన్నారు. **యడ్లపాడు**లోని శాఖా గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. బి.నాగేశ్వరరావు, వై.సంజీవరావు, వెంకట్రావు, పిఎస్ కుమారి, మీరావలి పాల్గొన్నారు. **అమరావతి** మండలం మునుగోడు జెడ్‌పి పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలేసి నివాళులర్పించారు. హెచ్ఎం డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అణచివేతకు గురైన బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడారని అన్నారు. ఉపాధ్యాయులు రామమోహన్‌రెడ్డి, ఎన్.హుస్సేన్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయినిగా పీడిత ప్రజలు, స్త్రీల విద్యాభివృద్ధికి పాటుపడ్డారని, మహిళలను చైతన్యవంతం చేయడానికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్.కె.సలావుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గురుకుల పాఠశాల, శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్, శ్రీమార్గదర్శి హైస్కూల్, కేరళ మోడల్ స్కూల్, శాంతికేతన్ పబ్లిక్ స్కూల్, వీనస్ పబ్లిక్ స్కూల్, మండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్, మల్లాది, లింగాపురం జెడ్‌పి పాఠశాలల్లోనూ సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించారు. **రొంపిచర్లలోని** చెరువుకట్ట సెంటర్లో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలే జయంతి నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీనివాసరావు మాట్లాడారు. మండల అధ్యక్షులు జి.సాంబశివరావు, నాయకులు ఎస్.తిమ్మరాజు, ఎం.వెంకటేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, యు.వెంకటేశ్వర్లు, కె.అంకమ్మరావు, ఎం.శ్రీనివాసరావు, కె.నరసింహా, భూషయ్య, పి.ప్రసాద్, బి.అశోక్, పి.హుస్సేన్ పాల్గొన్నారు. **నాదెండ్ల** మండలం చిరుమామిళ్ల మోడల్ హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత అయిన స్కూల్ ప్రిన్సిపాల్ ఝాన్సీని సన్మానించారు. ఎస్ఎఫ్ఐ చిలకలూరిపేట అధ్యక్షుడు యు.సిద్ధు, కార్యదర్శి కె.రమాదేవి పాల్గొన్నారు.



అమరావతి మండలం మునుగోడు జెడ్‌పి పాఠశాలలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల నివాళి



చిలకలూరిపేటలో విగ్రహాల వద్ద నివాళి



నాదెండ్ల మండలం చిరుమామిళ్లలో



యడ్లపాడు గ్రంథాలయంలో..



సత్తెనపల్లిలో జైభీమ్ పార్టీ నివాళి

పన్ను వసూళ్లు నూరుశాతం పూర్తి చేయాలి

నగర అదనపు కమిషనర్ పెద్ది రోజా

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో మార్చి 15 నాటికే పన్ను వసూళ్లు నూరు శాతం పూర్తి కావాలని, అందుకు తగిన విధంగా ఆర్ఐల వారీలా లక్ష్యాలను నిర్దేశించామని జిఎంసి అదనపు కమిషనర్ పెద్ది రోజ తెలిపారు. కమిషనర్ ఆదేశాలతో మంగళవారం అదనపు కమిషనర్ తమ చాంబర్‌లో పన్ను వసూళ్లపై డిప్యూటీ కమిషనర్లు, ఆర్‌ఓలు, ఆర్ఐలతో ప్రత్యేక సమీక్ష చేసి, డిశంబర్ 31న ఒక్కరోజు కలెక్షన్‌లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ నిలవడంలో కృషి చేసిన రెవెన్యూ విభాగాన్ని అభినందించారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రూ.144 కోట్ల డిమాండ్‌కుగాను, ఇప్పటి వరకు రూ.75.20 కోట్లు వసూళ్లు కాగా మిగిలిన రూ.68.8 కోట్లు బకాయి వసూళ్లకు బుధవారం నుండే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జనవరి 1 నుండి ప్రస్తుత అర్ధ సంవత్సరానికి కూడా వడ్డీ నమోదు అయినందున



వసూలు వేగవంతం చేయాలన్నారు. సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు రెవెన్యూ వార్డుల వారీగా బకాయిదార్ల జాబితా బుధవారం సాయంత్రానికి అందించాలని ఆర్.ఓ.లను ఆదేశించారు. పన్ను చెల్లింపులో స్పందించని బకాయిదార్లకు రెడ్ నోటీసులు జారీ చేయాలని, వాటికి స్పందించని వారికి అత్యవసర సర్వీసుల నిలుపుదల నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. పతి ఆర్ఐకి ఒక ఫిట్టర్‌ని కేటాయిస్తామని, అత్యవసర సర్వీసుల నిలుపుదల నోటీసులకు స్పందించని వారి ఇంటి ట్యాప్ కనెక్షన్ తొలగించాలన్నారు. మార్చి 31 వరకు చెక్కుల రూపంలో వసూళ్లు చేసిన మొత్తాన్ని జమ అయ్యేలా ఉండాలని, ఎటువంటి పరిస్థితులలో చెక్ బౌన్స్ అవ్వకుండా ఆర్.ఐ.లు చూడాలన్నారు. ప్రైవేట్ భవనాలలో అద్దెలకు ఉండే బ్యాంకులు, కాలేజిలు, హాస్టల్స్, హాస్పిటల్స్ వంటి వాణిజ్య సముదాయాల వారికి రెంట్ అటాచ్మెంట్ నోటీసులు జారీ చేసి, అద్దెదారుల నుండి పన్ను వసూళ్లు చేయాలన్నారు. పన్ను బకాయిలు చెల్లించకుండా ట్రేడ్ లైసెన్స్ జారీ చేయకుండా, ప్రతి వాణిజ్య సముదాయంకు ట్రేడ్ లైసెన్స్ విధించాలని ప్రజారోగ్య అధికారులకు ప్రత్యేక నోట్ సిద్ధం చేయాలని రెవెన్యూ సూపరిండెంట్ ను ఆదేశించారు.

నగరపాలక సంస్థ నుండి భవన నిర్మాణ అనుమతులు జారీ చేసే ముందే ఖాళీ స్థల పన్ను చెల్లింపు ఎన్.ఓ.సి. ఉండేలా చూడాలని సిటి ప్లానర్ కి నోట్ పంపాలని సూపరిండెంట్ ని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ, ఆర్.ఓ.లు ప్రసాద్, బాలాజీ బాష, రవి కుమార్, పోలేశ్వరరావు, సూపరిండెంట్ వెంకట రామయ్య, ఆర్.ఐ.లు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా ఛైర్మన్, సెక్రెటరీ జనరల్‌గా కళాధర్, జోగారావు ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఎపిఆర్ఇఐటిఎ రాష్ట్ర అధ్యక్షులు, ఎన్నికల అధికారి డి.మధుసూదన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్‌గా ఎం.కళాధర్(యుటిఎఫ్) సెక్రెటరీ జనరల్‌గా పి.జోగారావు(ఎపిఆర్ఇఐటిఎ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్.వెంకటేశ్వర్లు



ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఎం కళాధర్



ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ పి జోగారావు

మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పట్ల ఇంత నిర్లక్ష్యం గతంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉపాధ్యాయుల ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయకపోతే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. నూతన ఛైర్మన్ కళాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ నియంతృత్వ విధానాలను ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొడతామని అన్నారు. సెక్రెటరీ జనరల్ జోగారావు మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత ఫ్యాప్టో ఉద్యమ బాట పడుతుందని చెప్పారు. సమావేశంలో ఫ్యాప్టో కో ఛైర్మన్‌గా పి.ప్రసాద్ (డిటిఎఫ్), ఎం.సాంబశివరావు (ఎస్‌సిఎస్‌టియు), డిప్యూటీ సెక్రెటరీ జనరల్స్‌గా జి.మోహనరావు (ఎస్‌టియు), ఎండి. ఖాలిద్ ఎపిటిఎఫ్ 257, జి.వేళంగిణిరాజు (ఎపిటిఎఫ్ 1938, సెక్రెటరీలుగా జి.శ్రీనివాసరావు(హెచ్ఎంఎ), ఎండి నజీర్(ఎపిటిఎ), అబ్దుల్ షాజీర్(ఆర్‌యుటిఎ) ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా మరో 12 ఎన్నికయ్యారు.

మద్దన నారాయణ, హరిత దంపతులకు ఘన నివాళి

కుటుంబ సభ్యులకు పలువురు పరామర్శ

ప్రజాశక్తి - పెదనందిపాడు

డిసెంబర్ 28న అమెరికాలో మంచు కారణంగా చోటు చేసుకున్న దుర్ఘటనలో గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రుకు చెందిన దంపతులు మద్దన నారాయణ, హరిత భౌతిక కాయాలను అమెరికా నుండి సోమవారం రాత్రి పాలపర్రు గ్రామానికి తీసుకు వచ్చారు. మంగళవారం నిర్వహించిన అంత్యక్రియలకు పలు రాజకీయపార్టీల నాయకులు హాజరై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూమతి తెలిపారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు భౌతికకాయాలకు నివాళులర్పించి మృతుని మద్దన నారాయణ కుమార్తెలు హర్షిత, పూజిత, నారాయణ తల్లిదండ్రులు మద్దన సుబ్బారావు, వెంకటరత్నంలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం పెదనందిపాడు శాఖ కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సిపిఎం మండల నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, కొత్త వెంకటశివరావు,



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు

చుక్కా యానాదులు, దేవరకొండ శ్రీను, సిపిఐ పత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ ముసునూరి రమేష్, వైసీపీ నాయకులు కల్లూరి నాగేశ్వరరావు, బండి వెంకటశివరావు తదితరులు ఉన్నారు.

మతిమరుపునకు మందు

కెఎల్‌యు బయో టెక్నాలజీ బృందం పరిశోధన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మానవుల పురోగతి పరిశోధనలపైనే ఆధారపడి ఉందని మరోసారి రుజువైయ్యింది. మానవులకు అతిపెద్ద సమస్యగా మారిన మతిమరుపు పై కెఎల్ విశ్వవిద్యాలయ అధ్యయన బందం చేపట్టిన పరిశోధనలో పలు ఆసక్తికర విషయాలను గుర్తించినట్లు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీ విభాగంలో అడ్వాన్స్ పరిశోధనపై అద్యయనం చేస్తున్న డాక్టర్ ఎస్‌కె చాంద్‌బాషా పోస్ట్- డాక్టోరల్ రీసెర్చ్ (పిడిఎఫ్)గా పనిచేస్తున్నారు. చంద్‌బాషా, ఆయన



బృందం చేపట్టిన పరిశోధనలో మతిమరుపునకు సంభందించిన నూతన శాస్త్రీయ కోణాన్ని గుర్తించారు. దీనిపై మరింతలోతుగా పరిశోదించడం కోసం తాను గుర్తించి పరిశోధక అంశం క్యూ1 జర్నల్, జర్నల్ ఆఫ్ అల్జీమర్స్ వ్యాధి (జెఎడి)లో ఇంపాక్ట్ ఫ్యాక్టర్ 4.160తో ప్రచురణకు అంగీకరించబడిందని వారు తెలిపారు. పని యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, డాక్టర్ షేక్ చాంద్ బాషాని జెఎడి జర్నల్‌కు అసోసియేటెడ్ ఎడిటర్‌గా ఆహ్వానించబడ్డారని తెలిపారు. కెఎల్ విశ్వవిద్యాలయం నుండి ఆచార్య జానకీ రామయ్య , ప్రొఫెసర్ చాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావుల మార్గదర్శకత్వంలో డాక్టర్ చాంద్ బాషా ఈ పరిశోధనని చేసినట్లు తెలిపారు.

పారిశుధ్య సమస్యను పరిష్కరించండి

జిల్లా కలెక్టర్‌కు నారా లోకేశ్ లేఖ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పెదవడ్లపూడి గ్రామం రామకష్ణయ్య నగర్‌లో స్థానికులు ఎదుర్కొంటున్న పారిశుధ్య సమస్య పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళవారం లేఖ రాశారు. బీసీలు, మైనార్టీలు ఎక్కువగా నివసించే రామకష్ణయ్య నగర్‌లో పారిశుధ్యం లోపించిందని, ఓపెన్ డ్రెయినేజి నిర్వహణ లోపం కారణంగా అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేరొన్నారు. డ్రెయినేజీ నీళ్లు రోడ్లపైకి రావడంతో ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని, దోమల తీవ్రతతో రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, డ్రెయినేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.

అనుమానాస్పందంగా వివాహిత మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

అమరావతి కరకట్టపై ఇస్కాన్ టెంపుల్ వద్ద నివాసం ఉంటున్న వివాహిత పుచ్చకాయల పావని (37) తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది అయితే పావని తల్లిదండ్రులు తమ కుమార్తెను భర్త మహేష్, అతని కుటుంబసభ్యులు హత్య చేశారని ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి భర్త మహేష్‌ను అదుపులోకి తీసుకుని తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో కేంద్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఉపశమన సంరక్షణ చికిత్స పై వివిధ విభాగల వైద్యులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ



నెల 11 వరకు శిక్షణ తరగతులు జరగనున్నాయి. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జి. ఎస్. నవీన్ కుమార్ హాజరయ్యారు. నవీన్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగుల కు మెరుగైన వైద్యసహాయం అందించడానికి ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇందుకు వైద్యులు, సిబ్బంది సంసిద్ధం కావాలని అన్నారు. క్యాన్సర్ హెచ్ ఓ డి డాక్టర్ జి దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు.. సామ్రాజ్యం (ఫైల్)

సిపిఎం అభిమాని సామ్రాజ్యం కన్నుమూత

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి గ్రామానికి సిపిఎం అభిమాని ఉయ్యూరు సామ్రాజ్యం (64) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆమె భర్త ఉయ్యూరు పూర్ణారెడ్డి సీతానగరం పిడబ్ల్యుడి వర్క్యుషాపులో సిఐటియు యూనియన్‌లో చురుగ్గా పని చేశారు. గ్రామంలో సిపిఎం అభివృద్ధికి పూర్ణారెడ్డితో పాటు సామ్రాజ్యం పని చేశారు. సామ్రాజ్యం మృతికి సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మహిళా సంఘం రాష్ట్ర నాయకులు డి.శ్రీనివాసకుమారి, సుందర్య సేవా సమితి కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, ఉండవల్లి కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు రామారావు, సిహెచ్.సుందరరావు, ఇమ్మానుయేలురాజు, ఉండవల్లి పార్థసారథి, పి.గాంధీ, శివయ్య నివాళులర్పించారు. సామ్రాజ్యం అంత్యక్రియలు గురువారం ఉండవల్లి గ్రామంలో నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.



మాట్లాడుతున్న వేముల దుర్గారావు

కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

కరోనా సమయంలో కూడా తమ ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలందించిన ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, జీతాలు మొత్తం ఒకేసారి అకౌంట్‌లో వేయాలని ఎపి ఆశ వర్కర్ల యూనియన్ సిఐటియు మండల గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆశ వర్కర్ల మండల స్థాయి సమావేశం నులకపేటలో కోలంకి శ్యామల అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు సెల్‌ఫోన్లు ఇవ్వాలని, సంబంధంలేని పనులు చేయించవద్దని, ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక ఆశ వర్కర్‌ను నియమించాలని కోరారు. జీతంతో కూడిన మెటర్నటీ సెలవులతో పాటు సాధారణ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.లక్ష్మి, వి.రేణుక, విజయ, దేవి, కరుణ, సుగుణ, వరలక్ష్మి, విశాలాక్షి, రాణి తదితరులు పాల్గొన్నారు.

రైతు కూలీలకు జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పురుగు మందు చల్లుతూ అస్వస్థతకు గురైన మండలంలోని దండమూడికి చెందిన రైతు కూలీలకు జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా మంగళవారం పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. వీరంతా రైతులని, వ్యవసాయం గిట్టుబాటు కాక, వ్యవసాయ పనులు సైతం స్థానికంగా దొరక్క పనుల కోసం పెదనందిపాడు మండలం చిననందిపాడుకు వెళ్లారని, మెక్కజొన్న పొలంలో గుళిక మందు చల్లుతూ 18 మంది కూలీలు ఒక్కసారిగా కుప్పకూలారని చెప్పారు. తమదీ రైతు కుటుంబమేనని, రైతుల బాధలు తెలుసుగనుకనే వారికి సాయం చేయాలనిపించిందని చెప్పారు. ఒక్కొక్కరికి రూ.3 చొప్పున ఇచ్చామన్నారు. ఇదే గ్రామంలో ముగ్గురు వికలాంగులకు రూ.2 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జె.సుబ్బారావు, మానుకొండ వారిపాలెం మాజీ సర్పంచ్ కె.వెంకటరెడ్డి, మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత షేక్ అబ్దుల్ రవూఫ్, జి.శ్రీనివాసరెడ్డి, షేక్ కరిముల్లా, ఎం.శేషిరెడ్డి, మోహిద్దీన్, శ్రీకాంత్‌రెడ్డి, బేరింగ్ కాలేషావలి, యుసూబ్, వలి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

'బిఆర్ఎస్‌లోకి నిలకడ లేని నాయకులు'

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రత్యేక రాష్ట్రం ప్రకటిస్తే టిఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని కాంగ్రెస్ పార్టీని మోసం చేసిన కెసిఆర్ ఆంధ్రప్రదేశ్ ప్రజలనూ మోసం చేస్తారని దళిత బహుజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జి.రమేష్‌కుమార్ అన్నారు. స్థానిక సమితి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బిఆర్ఎస్‌లో చేరిన తోట చంద్రశేఖర్, రావెల కిషోర్‌బాబు నిలకడ లేనివారిన, టిడిపి, వైసిపి, జనసేన, ప్రజారాజ్యం, బిజెపి తదితర పార్టీలు వారు మారారని అన్నారు. బిఆర్ఎస్‌లో చేరిన వీరు ఆంధ్ర ద్రోహులని, వీరితోపాటు కెసిఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తామని అన్నారు.



అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - అమరావతి

రాష్ట్ర జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన మునుగోడు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డిని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బిసి జూపూడి విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం సన్మానించారు. ఎమ్‌డి గౌషియ సుల్తానా, విద్యార్థులు, విద్యాకమిటి చైర్మన్ పాల్గొన్నారు.

6న అమరేశ్వరునికి అన్నాభిషేకం

ప్రజాశక్తి - అమరావతి

అమరేశ్వరునికి ఈనెల 6వ తేదీ తెల్లవారుజాము 3 గంటలకు ఆరుద్రోత్సవ, శివ ముక్కోటి సందర్భంగా అన్నాభిషేకం ఉంటుందని ఆలయ అధికారి సునీల్ కుమార్ మంగళవారం తెలిపారు. అన్నాభిషేకం సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి భక్తులకు అన్న సంతర్పణ జరుగుతుందని, భక్తులు శ్రీఅమరేశ్వరస్వామివారి అన్నాభిషేకమునకు ధన, వస్తు రూపంలో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగాగాని పాల్గొన దలచినవారు శ్రీస్వామివారి కార్యాలయం నందు సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 9666856255 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

పెంచిన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని టిటిడి కళ్యాణ మండపంలో మంగళవారం పింఛను వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని పింఛన్లు, పింఛను పంత్రాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో 7980 మందికి పింఛన్లు వస్తుండగా అదనంగా 261 మంజూరయ్యాయని, మొత్తంగా 8241 పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం పింఛను పెంపుపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపిపి పి.ఝాన్సీసాగర్, జెడ్‌పిటిసి ఎం.వాసు, సర్పంచ్ కె.హేమ, ఎంపిటిసి కీర్తి అరుణ్‌కుమార్, ఎంపిడిఒ వై.హనుమారెడ్డి, తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు గౌస్‌సందాని, వైసిపి నాయకులు కె.విజయ్‌కుమార్, జి.శంకర్, ఆర్.చింతారావు, బి.శివరామకృష్ణ, మాజీ ఎంపిపి ఎంవి బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.


యడ్లపాడులో పింఛను పత్రాలను అందిస్తున్న మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ కానుకను లబ్ధిదార్లు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని మున్సిపల్ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన పింఛను పంపిణీని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఇప్పటివరకు 2,62,413 పింఛన్లు ఇస్తుండగా, వాటితో పాటు అదనంగా 8,818 పెన్షన్లు ప్రభుత్వం పెంచి ఇస్తుందని తెలిపారు. అనంతరం కొత్త వారికి పింఛను పత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, జిల్లా అభివృద్ధి అధికారి మహాలక్ష్మి, జిల్లా మహిళా సంమాఖ్య అధ్యక్షులు అనూష పాల్గొన్నారు.


నరసరావుపేటలో మాట్లాడుతున్న కలెక్టర్


నూజెండ్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నూజెండ్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పింఛను వారోత్సవాల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని మాట్లాడారు. నూజెండ్ల మండలంలో గతంలో 6643 మందికి పింఛన్లు ఇస్తుండగా కొత్తగా 278 మందికి మంజూరైనట్లు చెప్పారు. ఇప్పటి వరకు ప్రతినెలా రూ.2,500 చొప్పున వస్తున్న పింఛను ఇకమీదట రూ.2,750 వస్తుందని తెలిపారు. పింఛన్లలో కోతలు విధిస్తున్నారనే ప్రతిపక్ష టిడిపి ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చితో ప్రజల ప్రాణాలు తీస్తున్నారని దుయ్యబట్టారు. వినుకొండ నియోజకవర్గాన్ని తాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తుంటే అందుకు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అడ్డు పడుతున్నారని విమర్శించారు. అయినా అభివృద్ధి ఆగదని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి మేడం జయరాంరెడ్డి, ఎంపిడిఒ జిలానిబాష, మార్కెట్ యార్డ్ చైర్మన బి.చిన్నబ్బాయి, చెడ్‌పిటిసి జె.సుబ్బరామయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వి.ప్రసాద్, వైసిపి మండల కన్వీనర్ ఎన్.నాగిరెడ్డి, నూజెండ్ల సొసైటీ అధ్యక్షులు పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా కాంపోజిట్ సిలిండర్లు

ప్రజాశక్తి - మాచర్ల

ఇండియన్ అయిల్ కార్పొరేషన్ నూతనంగా ప్రవేశపెట్టిన కాంపోజిట్ సిలెండర్ల సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. కాంపోజిట్ సిలిండర్ల సేల్స్‌ను మంగళవారం ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ఎంతో సౌకర్యంగా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఐఒసి కాంపోజిట్ సిలెండర్లను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఐఒసి సేల్స్ ఆఫీసర్ ఆశోక్ రాజగోపాల్ మాట్లాడుతూ కాంపోజిట్ సిలెండర్ బరువు ఆరు కిలోలు మాత్రమే ఉంటుందని, ఇందులో 10 కిలోల గ్యాస్ ఉంటుందని, ఎంత గ్యాస్ ఉండేది కనిపిస్తుందని వివరించారు. దీని వినియోగంలో ఫ్లోరింగ్‌పై మరకలు పడవని, ఫైర్ ఎక్సిడెంట్ జరిగినప్పుడు కూడ కాంపోజిట్ సిలెండర్ పేలదని తెలిపారు. రూ.3వేల డిపాజిట్‌తో బుకింగ్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక గ్యాస్ డీలరు ఏరువా మర్రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.


సిలిండర్ విక్రయాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వైసిపి పాలనలో అధ్వానంగా రాష్ట్రం : టిడిపి

ప్రజాశక్తి - నరసరావుపేట



వైసిపి హయాంలో రాష్ట్రంలో పరిస్థితి అధ్వానంగా తయారైందని, రైతులు ప్రజలు, అన్ని రంగాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక లలితాదేవి కాలనీలో మంగళవారం నిర్వహించిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో అరవిందబాబు పాల్గొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం చేశారు. ప్రజల పట్ల కనీసం మానవత్వం లేకుండా వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, పదేపదే పన్నుల భారం మోపుతోందని విమర్శించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నాయకులు సిహెచ్.శ్రీనివాస్‌రావు, పి.బసవేశ్వరరావు, బాలస్వామి, చెన్నయ్య, వీరయ్య, ఎస్.అమర్నాథ్, ఎల్.లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

1861 చట్టం ద్వారా జీవో అప్రజాస్వామికం

- బాబు, లోకేశ్ యాత్రలను అడ్డుకోవడానికేనన్న జీవీ ఆంజనేయులు
- జీవో ప్రతులను దహనం చేసి సిపిఐ నిరసన

ప్రజాశక్తి - వినుకొండ

చంద్రబాబు నాయుడు సభలకు వస్తున్న జన సందోహాన్ని చూసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బెదిరిపోతున్నారని, టిడిపి సభలను అడ్డుకోవడానికి 1861 చట్టం ద్వారా జీవోలు తెస్తున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు రోడ్ షోలకు, సభలకు లక్షలాదిమంది ప్రజలు తరలివస్తుంటే ఓర్వలేని వైసిపి తోపులాటలు, తొక్కిసులాటలు చేయించి తప్పుడు సంకేతాలను సృష్టిస్తోందని ఆరోపించారు. కందుకూరు, గుంటూరు ఘటనలు పోలీసుల వైఫ్యలమేనన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు రోడ్డుమీదికి రాకుండా మానేస్తారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు రోడ్డు షోలతోపాటు ఈనెల 26 నుండి లోకేశ్ 'యువగళం' పాదయాత్రనూ అడ్డుకునేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని అన్నారు. లోకేశ్ పాదయాత్రను ఎవరు అడ్డుకోలేరని స్పష్టం చేశారు. అభివృద్ధి చేయటం చేతగాని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రజలను నమ్మించేందుకు ఆరాటపడుతున్నాడని, ఆయన నటనను ప్రజలు గుర్తించారని అన్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా తెచ్చారా? అని ప్రశ్నించారు. పొలిటికల్ రియల్ ఎస్టేట్ చేస్తూ అవినీతి అక్రమాలతో వందల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. వినుకొండ పట్టణానికి శాశ్వత తాగునీటి పథకానికి, గ్రామీణ తాగునీటి పథకానికి టిడిపి హయాంలో నిధులు తెచ్చినా వాటిని పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. చౌకబారు విమర్శలు మానుకొని చేతనైతే అభివృద్ధి చేయాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పివి సురేష్ బాబు, నాయకులు షమీంఖాన్, పి.దాసయ్య, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


జీవో ప్రతులను దహనం చేస్తున్న సిపిఐ నాయకులు

సిపిఐ నిరసన

రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా తెచ్చిన పోలీస్ యాక్ట్ 1861ను వెంటనే రద్దు చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక శివయ్య స్తూపం సెంటర్లో జీవో ప్రతులను దహనం చేశారు. ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు జగన్‌పై ఇదే చట్టాలను ప్రయోగిస్తే జనం వద్దకు వెళ్లేవారా? సిఎం అయ్యేవారా? అని శ్రీనివాసరావు ప్రశ్నించారు. జీవోను రద్దు చేయకుంటే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యు.రాము, బి.సాగర్, ఎ.పవన్‌కుమార్, చిన్నసుభాని, పుల్లయ్య పాల్గొన్నారు.



ఏఎన్‌యూలో నివాళులర్పిస్తున్న విసి రాజశేఖర్





మంగళగిరిలో.

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

ప్రజాశక్తి-ఎఎన్‌యు

మహిళా విద్యకు,సాధికారతకు పునాది వేసిన ప్రథమ మహిళ సావిత్రిబాయి పూలే అని వర్సిటీ విసి. రాజశేఖర్ అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆద్వర్యములో సావిత్రిబాయి పూలే 192వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో వున్న మహాత్మా జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహానికి, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్, రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి , ఆచార్య. ఎం. త్రిమూర్తి రావులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్వవిద్యాలయలోని ఆచార్య ఎల్. వేణుగోపాలరెడ్డి సెమినార్ హాల్‌లో జయంతి వేడుకలో ఆచార్య. ఎం. త్రిమూర్తిరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి విసి ఆచార్య పి. రాజశేఖర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళల విద్యకు, సాధికారతకు పునాది వేసిన ప్రథమ మహిళా సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆత్మీయ అతిథి రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి మాట్లాడుతూ శ్రీమతి సావిత్రిబాయి పూలే చేసిన సామాజిక సేవలను ఆదర్శంగా ప్రతిఒక్కరు తీసుకోవాలని చెప్పారు. **గుంటూరు:** చుట్టుగుంట సెంటర్ లోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, బీసీ రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ సావిత్రి బాయ్ పూలే చిత్ర పట్టానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా యువజన అధ్యక్షులు తురక రమేష్, బీసీ నాయకులు తమిశెట్టి రాజు, కుమ్మర శ్రీ హర్ష నివాళులర్పించారు **మంగళగిరి:**ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి ఎమ్మెల్యే ఆర్కే, మార్కెట్ యార్డు ఛైర్ పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైసిపి చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి తదితరులు పూలమాల వేసినివాళులర్పించారు. ఎపి బిసి సేన ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి బీసీ సేనా జిల్లా అధ్యక్షులు గోలి నాగ కుమార్, నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 192 జయంతి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్నం నాగబాబు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వాకా మాధవరావు, నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఆలా శివాజీ, సంఘం నాయకులు పాల్గొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే స్మారక అవార్డును డాక్టర్ సరళకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జివి రాంప్రసాద్, ఎస్సీ ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి కె రామారావు, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఐ నాయకులు గంజి వెంకయ్య, దళిత సంఘాల నాయకులు దిడ్ల సత్యానందం పాల్గొన్నారు.**తెనాలి:**స్థానిక కొత్తపేట రావి సాంబయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో సావిత్రీభాయి పూలే జయంతి కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు నిర్వహించారు. తొలితరం ఉపాధ్యాయినిగా మహిళల్లో విద్యాభివృద్ధికి నాంది పలికిన సావిత్రీభాయి పూలే సేవలను పలువురు వక్తలు ప్రశంసించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాభిని సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు తన్నీరు శివశంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చుక్కా భానుప్రసాద్, కాసరనేని శ్రీనివాసరావు, రాంబాబు, ఉపాధ్యాయులు రాజరాజేశ్వరి, కృష్ణవేణి, ప్రకాష్ పాల్గొన్నారు

టిడిపి కార్యాలయంలో..పట్టణ టిడిపి అధ్యక్షులు టి.హరిప్రసాద్ అద్యక్షతన స్థానిక టిడిపి కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మేశ్వరరావు, జె.మహేష్, కె.కనకరాంబాబు, కె.ఏడుకొండలు, డి.శ్యామ్, ఎం.విజయకుమార్, కె.శ్రీనివాసరావు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.**బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ..** బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు మేడిబోయిన గంగాయాదవ్ సావిత్రీభాయ్ పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈనెల 7న పట్టణంలో నిర్వహించే బిసి ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అశోక్, క్రాంతికుమార్, రమణ, వెంకటేశ్వరరావు, రాజారమేష్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: పత్తిపాడు గ్రంథాలయంలో సావిత్రి భాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అదికారి అరుణ సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలను వేసి నివళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **గుంటూరు జిల్లా ప్రతినిధి:** అరండల్ పేట ఒకటో లైన్ అంబేద్కర్ మినీ హాల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి జయంతిని టీచర్స్ డేగా భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని పలువురు వక్తలు కోరారు. రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కన్వీనర్ వైకె, దళిత ఉద్యమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా ప్రభుదాసు, బహుజన మహాసభ జాతీయ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జి ఆర్ భగత్ సింగ్, బిసి మహాజనసభ రాష్ట్ర కన్వీనర్ ఉగ్గం సాంబశివరావు, వడ్డెర సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తన్నీరు సాంబయ్య ,భీమసేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నీలాంబరం ప్రజా పోరు పార్టీ నాయకులు పి కోటేశ్వరావు, ముస్లిం హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి, వి. విజయలక్ష్మి ప్రసంగించారు.



తెనాలిలో ..



దుగ్గిరాలలో..



ప్రత్తిపాడులో..



గుంటూరులో..

బిసి యువజన విభాగం ఆధ్వర్యంలో ..

బీసీ సంక్షేమ సంఘ యువజన అధ్యక్షులు ఉప్పాలా రాజ్ కిరణ్ ఆధ్వర్యంలో స్థానిక అరండల్ పేటలోని మోర్ల వెంకటకృష్ణ కార్యాలయంలో ఘనంగా సావిత్రి భాయ్ పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరావు,టి.వేణుగోపాల్, దర్ బాబా,సుభాని,కేకే, రవి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. **దుగ్గిరాల:** సమాజంలోని దురాచారాలను ఎదిరించి ఆడపిల్లలకు చదువు నేర్పిన మొట్టమొదటి మహిళా టీచర్ సావిత్రిబాయి పూలే అని దుగ్గిరాల ఎంపిడిఓ కుసుమ శ్రీదేవి అన్నారు. స్థానిక బాలికల హాస్టల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. జడ్‌పిటిసి మేకతోటి అరుణ, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణిలు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలికలకు సీట్స్ పంచిపెట్టారు. సూపర్డెంట్ డి. వీరయ్య ,హాస్టల్ వార్డెన్ కె భవానిలు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రజాశక్తి-ఫిరంగిపురం : పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని వేమవరం గ్రామంలో మంజూరైన నూతన పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. తొలుత సిఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఇచ్చిన మాట కట్టుబడి పని చేస్తుందని, అందులో భాగంగానే పింఛన్లు ఈ నెల 1 నుంచి రూ. 2,750 చేసిందని అన్నారు. పింఛన్లు తొలగిస్తున్నట్లు ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. పాతవి తొలగించకుండానే కొత్తవి మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. టిడిపి 39 లక్షల పింఛన్లు ఇస్తే ఇప్పుడు 68 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తించాలన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ పింఛన్లు ఉన్నాయన్నారు.

సచివాలయంలో పని చేయని చేతి పంపులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ప్రజల దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ ఆవరణలో వేసిన చేతిపంపులు నేడు తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. నెలలు తరబడి పనిచే యకుండా ఉన్నా అధికారుల మాత్రం వాటిని బాగు చేయించడం లేదు. దీంతో సచివాలయాలకు వచ్చే వృద్ధులు, మహిళలకు తాగునీటికి అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంటియంసి పరిధిలోనీ కుంచనపల్లి గ్రామ సచివాలయంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కార్యాలయం ఆవరణలో వేల రూపాయలు వెచ్చించి రెండు చేతి పంపులు ఏర్పాటు చేశారు. కాని ప్రస్తుతం అవి పని చేయకపోవడంతో తుప్పు పట్టి, శిథిలమై నిరుపయోగంగా మారిపోయాయి. సచివాలయ ఉద్యోగస్తులు తాగేందుకు మినరల్ వాటర్ ఉపయోగిస్తూ సచివాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చే చేతిపంపులను బాగు చేయించడం విస్మరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు వెంటనే చేతి పంపులను బాగుచేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.



నిరుపయోగం ఉన్న చేతి పంపు



డస్ట్‌బిన్లను అందజేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు

షాపుల ముందు డస్ట్ బిన్లు తప్పనిసరి

ప్రజాశక్తి-తెనాలి

వ్యాపార కూడళ్ళ నుంచి వెలువడే చెత్తాచెదారాన్ని రోడ్డు పై వేయకుండా తప్పనిసరిగా డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్‌కమిషనర్ ఎం.గోపాల రావు చెప్పారు. మంగళవారం పురపాలక సంఘ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో షాపులను ఆయన పరిశీలించారు. వ్యాపారులకు డస్ట్‌బిన్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను రోడ్డుపై వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, శానిటరి సెక్రటరీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమితి సభ్యులు

8న మహిళలకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు బ్రాడిపేటలోని బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన సమితి ప్రాంగణంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు ఆర్. లక్ష్మీపతి, కార్యదర్శి కొప్పర్తి సీతారమేష్ తెలియజేశారు. సమితి కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆసక్తి కలిగిన మహిళలు పాల్గొనాలని కోరారు. బ్రాహ్మణ సేవా సమితి పది మంది వృద్ధులకు, 50 మంది విద్యార్థులకు వసతి కల్పిస్తున్నట్టు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మార్చి 1న బ్రాహ్మణ పిల్లలకు సామూహిక ఉపనయనములు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సజ్జల రామకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సజ్జల రామకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

తాడేపల్లిలోని వైసిపి ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని మంగళవారం వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో పొన్నూరు నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు రాష్ట్ర వైసిపి రైతు విభాగ కార్యదర్శి వడ్రానం ప్రసాద్ , వైసీపీ నాయకలు నన్నపనేని అంకినీడు చౌదరి పుట్ట సుబ్బారావు, నాగూర్ భాషా తదితరులు ఉన్నారు.

జిల్లాలో 2.56 లక్షల మందికి పింఛన్లు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో వైయస్సార్ పెన్షన్ కానుక ద్వారా సంవత్సరానికి రూ.845 కోట్లు ఖర్చు చేసి, పేద ప్రజలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

మంగళవారం కలక్టరేట్‌లో పెన్షన్ కానుక పెంపుదల వారోత్సవాల కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్‌రావు, తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఎం. పురుషోత్తం, నగర డిప్యూటీ మేయర్ సజీలా పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో క్రొత్తగా 8300 పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. జనవరి 1 నుండి జిల్లాలో మొత్తం 2,56,551 మంది లబ్ధిదారులకు నెలకు మొత్తం రూ.70.48 కోట్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వైయస్సార్ పెన్షన్ కానుక క్రింద 2,56,551 మంది లబ్ధిదారులకు రూ.70,48,17,250/- ల చెక్కును పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆర్డిఓ ప్రభాకరరెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది లబ్దిదారులు పాల్గొన్నారు.

తాడికొండను వదిలేది లేదు : ఎమ్మెల్సీ డొక్కా

ప్రజాశక్తి - తుళ్లూరు

ఎన్నికలలో పోటీ చేసినా, చేయకపోయినా తాడికొండ నియోజక వర్గాన్ని విడిచిపెట్టే ప్రసక్తి లేదని వైసిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. మంగళవారం ఆయన వెంకటపాలెంలో మీడియాతో మాట్లాడారు. తన రాజకీయ ఆరంగేట్రం తాడికొండ నియోజక వర్గం నుంచి జరిగిందని, గుంటూరు జిల్లాలోని 7 నియోజక వర్గాలలోనూ వైసిపి గెలుపునకు కషి చేస్తూ తాడికొండపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తా నన్నారు. తాడికొండ గెలుపును జగన్ మోహన్ రెడ్డికి బహుమతిగా ఇస్తామన్నారు. తాడికొండలో ఎవరిని పోటీలో పెట్టాలనేది జగన్ మోహన్ రెడ్డి ఇష్టమన్నారు. సంక్రాంతి తరువాత పార్టీ బలోపేతానికి జగన్ మోహన్ రెడ్డి సూచనలతో బస్సు యాత్ర లేదా పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మాదల మహేంద్ర, ఫిరంగిపురం ఎంపిపి నర్గీస్, నాయుడు నాగేశ్వరరావు, జమ్ముల శ్రీనివాసరావు, గాదె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో డాక్టర్ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల : 2024 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టరు యరమల రామచంద్రారెడ్డి పోటీ చేస్తారని నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు వంగపాటి నాగరాజు అన్నారు. మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు వెంకటరావు నుండి మాచర్ల బిసి సెల్ అధ్యక్షులుగా నాగరాజు నియామకపత్రం అందుకున్నారు. నాగరాజును డాక్టరు యరమల రామచంద్రారెడ్డి అభినందించి, మాచర్ల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 5 మండలాలకు పార్టీ, ప్రజా సంఘాల బాధ్యులను సమిష్టిగా నియమించుకోని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. 2024లో పార్టీ అభ్యర్థిగా డాక్టరు రామచంద్రారెడ్డి గెలుపు లక్ష్యంగా పని చేస్తామన్నారు. తన నియామకానికి సహకారం అందించిన గౌరిప్రసాదు, షేక్ బాబు, జివి సత్యనారాయణ, రాగిడి బాబు తదితరులకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మాచర్ల విద్యార్థి

అండర్ 17 రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మాచర్ల విద్యార్థి రాచమంటి రాకేష్ రణధీర్ యాదవ్ ఎంపిక అయినట్లు సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ రాయల్ మేరి మంగళవారం తెలిపారు. డిసెంబర్ 31న గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన పోటీలలో 60 కేజీల విభాగంలో తమ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి రాకేష్ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా రాచమంటి రాకేష్‌ను ప్రిన్సిపాల్ , సిస్టర్ కృప, పిఈటి కుమార్, ప్రతాప్ తదితరులు అభినందించారు.



జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - మాచర్ల : జనవరి, ఫిబ్రవరి నెలల్లో గుజరాత్, మహారాష్ట్రలో జరగబోయే జాతీయ స్థాయి సీనియర్, జూనియర్, సబ్-జూనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్-షిప్ క్రీడాపోటీల ఎంపికలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా కార్యదర్శి శ్రీనివాసగౌడ తెలిపారు. 3వ రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్-జూనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్-షిప్-2023 క్రీడాపోటీలు, 5వ రాష్ట్ర స్థాయి సీనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్-షిప్-2023 క్రీడాపోటీలను విశాఖపట్నం వేదికగా జనవరి 11న పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహించబడతాయన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు జనవరి 6లోగా రిజిస్ట్రేషన్ కొరకు 7013569514, (వాట్సాప్ నెంబర్ 9494130391), 83093 83550 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. జనవరి 8 ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట లోపు గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద ప్రతి క్రీడాకారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని రాష్టస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

మాదల బిసి గురుకులానికి సెక్రెటరీ సందర్శన

సైన్స్ ల్యాబ్ కోసం రూ.12 లక్షలు మంజూరు



ప్రజాశక్తి - ముప్పాళ్ల : మండలంలోని మాదలలోని బిసి గురుకుల పాఠశాలను బిసి గురుకుల సెక్రటరీ ఎ.కృష్ణమోహన్ మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిభా సామర్థ్యాలను తెలుసుకున్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు సైన్స్ ల్యాబ్ కోసం రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మరో రూ.2.5 లక్షలను మంత్ర టీమ్ సంస్థ ద్వారా సంస్థ జోనల్ ఆఫీసర్ అక్కారావు అందించారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

సావిత్రిబాయి పూలే ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ సభలో వక్తలు



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

భారత దేశ తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో బాలికా విద్య కోసం కృషి చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. యుటిఎఫ్, కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆద్వర్యంలో స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో మంగళవారం సావిత్రిబాయిపూలే ప్రతిభా పురస్కారాలను 31 మంది ఉపాధ్యాయినిలకు అందచేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ 1848లోనే భర్త ప్రోత్సాహంతో మహారాష్ట్రలో పాఠశాలలు ఏర్పాటు చేసిన గొప్ప సంఘసంస్కర్త అని పేర్కొన్నారు. అప్పటితో పోల్చితే మహిళా అక్షరాసత్య అనేక రెట్లు పెరిగిందని, కానీ ఇంకా మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికీ స్త్రీ, పురుషుల మధ్య 20 శాతం అక్షరాస్యత వ్యత్యాసం ఉందన్నారు. పదోతరగతి తర్వాత పై చదువులు మానేస్తున్న వారిలో ఎక్కువ మంది బాలికలేనని తెలిపారు. విద్యార్థి కేంద్రంగా విద్య ఉండాలని, ముఖ్యంగా బాలికా విద్యను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే రాజకీయ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. 543 లోక్‌సభ సీట్లలో కేవలం 43 మంది మాత్రమే మహిళలున్నారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఏళ్ల తరబడి ఆమోదం పొందకుండా ఉందన్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని లక్ష్మణరావు ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉపాధ్యాయులు ఆమోదం తెలిపారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ సమాజంలో సగభాగం అయిన మహిళలకు విద్య ఎంతో అవసరమన్నారు. అక్షరాస్యతా ఉద్యమం బాలికా విద్య పెరగటానికి దోహదం చేసిందన్నారు. కెవిఆర్, జయలక్ష్మి ట్రస్టీ విజయ మాట్లాడుతూ పిల్లల అభివృద్ధి కోసం తల్లిదండ్రులు కష్టపడటం సాధారణ అంశమేనని, కానీ సావిత్రిబాయి పూలే సమాజంలో బాలికా విద్య అభివృద్ధి కోసం ఎన్నో అవమానాలు ఎదుర్కొని, పనిచేయటం గొప్ప త్యాగమన్నారు. ఆమె కృషి స్త్రీ విద్యకోసమే కాదని, మొత్తం సమాజ అభివృద్ధి కోసమని పేర్కొన్నారు. కన్న విద్యా సంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను విజ్ఞాన వంతుల్ని చేయటంలో, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించటంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కృషి అభినందనీయమన్నారు. ఉర్దూ డిఐ ఖాసిం, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ ప్రసంగించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు శివపార్వతి, షకీలాబేగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు అక్షయ విద్యా సంస్థలు, గుంటూరులోని ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన జానపద, అభ్యుదయ గీతాల నృత్య ప్రదర్శన అలరించాయి.

అవార్డు గ్రహీతలు

ఎన్.ఉషాకుమారి,హెచ్ఎం,శారదా నికేతన్, కె మంజుల, హెచ్ఎం ఎస్‌కెబిఎం హైస్కూల్, జివి. పద్మావతి ఎస్ఎ, ఎస్‌కెఎస్ఎంసి హైస్కూల్, పి.జ్యోతి ఎస్‌జిటి ఎంసిపిఎస్, నెహ్రూనగర్ డి.షహీద రంజాన్‌బి ఎస్‌జిటిఎస్‌జెఆర్‌ఆర్ఎం హైస్కూల్, కె.జయలక్ష్మి ఎస్‌జిటి ఎస్‌కెబిఎం హైస్కూల్, వి.హేమలత డ్రాయింగ్ ఎస్‌పిఎస్ స్కూల్, ఎం.అనంతలక్ష్మి, ఎస్ ప్రభావతికన్న ఇంగ్లీషు మీడియం స్కూల్, సుమేధా హైస్కూల్, గుంటూరు, పి.సరళాదేవి ఎస్‌జిటి పాతగుంటూరు ఎంపియుపిఎస్, డాక్టర్ డి.రోజ్‌లాండ్ జడ్‌పిహెచ్ హెచ్ఎం అంగలకుదురు, ఎ విజయలక్ష్మి ఎస్ఎ వేజెండ్ల జడ్‌పిహెచ్, జెవిఎల్ సునీత ఎస్ఎ కొర్రపాడు జెడ్పీ హైస్కూల్, పి.చంద్రకళావతి ఎస్ఎ మందడం జెడ్పీ హైస్కూల్, కె.ఉమాదేవి ఎస్ఎ చింతలపూడి జెడ్పీ హైస్కూల్, వై.ఫాతిమారాణిఎస్ఎ మంగళగిరి డాన్‌బాస్కో హైస్కూల్, కె.విజయలక్ష్మి ఎస్ఎ రేవేంద్రపాడు జడ్‌పిహెచ్, డి.భాగ్యలక్ష్మి, ఎస్‌జిటి, ఆత్మకూరు ఎంపిపిఎస్ , ఆర్.పుణ్యవతి ఎస్‌జిటి వడ్లమాను ఎంపిపిఎస్, ఆర్.శారద ఎ స్ జి టి ఈమని ఎంపిపిఎస్, బి.శివపార్వతిఎస్‌జిటి పొన్నెకల్లు ఎంపిపిఎస్, షేక్.షంషాద్‌బేంఎస్‌జిటి దోలస్‌నగర్ ఎంపిపిఎస్, టి.సుష్మారెడ్డి ఎస్‌జిటి వెంగళగరావు నగర్, ఎంపిఎస్, ఎం.ఆనందమేరి ఎస్‌జిటి మంగళగిరి, ఆర్‌సిఎంపి స్కూల్, జి.శ్రీదేవి ఎస్‌జిటి పొన్నూరు ఎంపిపిఎస్, జి.ముక్తేశ్వరి ఎస్‌జిటి యనమదల, ఎంపిపిఎస్ పి.విక్టోరియారాణి ఎస్‌జిటి అత్తోట ఎంపిపిఎస్, టి.శివపార్వతిఎస్‌జిటి పాలపర్రు ఎంపిపిఎస్, వి.శ్రీవల్లి డైరెక్టర్ అక్షయ విద్యా లయం, ప్రత్తిపాడు , కె.అరుణకుమారి లయన్స్ మాం టిస్సోరి స్కూల్, పెదనందిపాడు, ఎన్.గౌతమి డైరెక్టర్ గౌతమి హైస్కూల్, మంగళగిరి,

సావిత్రిబాయి పూలే ఆశయాలను యువతరం కొనసాగించాలి

సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

సంఘ సంస్కర్త, తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయరాలు సావిత్రబాయిపూలే ఆశయాలను, లక్ష్యాలను యువతరం కొనసాగించాలని, మహిళల అభ్యున్నతికి కృషి చేయడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళవారం బ్రాడిపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన సావిత్రిబాయిపూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ సావిత్రిబాయి మహిళల విద్యకోసం కృషి చేశారని, కట్టుబాట్ల పేరుతో మహిళలను ఇంటికే పరిమితం చేసే వ్యవస్థను వ్యతికేకించి మహిళా విద్య కోసం పరితపించారన్నారు. తాను చదువు నేర్చుకుని ఉపాధ్యాయినిగా కొనసాగించారని, తన నిజ జీవితంలో సాంప్రదాయవాదుల ఛీత్కారాలకు, అవమానాలకు గురై, వాటిని తట్టుకుని సమాజ అభివద్ధికి కషి చేశారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు దాటినా నేటికి మహిళలపై అత్యాచారాలు, దాడులు కొనసాగుతూనే వున్నాయని, సావిత్రిబాయిపూలే స్ఫూర్తితో వీటికి వ్యతిరేకంగా ఉద్యమించడమే ఆమెకు నిజమైన నివాళి అన్నారు. సమావేశంలో సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, నాయకులు సుధీర్, వై.కష్ణకాంత్, ఖాశిం షహీద్, కష్ణ, ఖాజవలి, శంకర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 192 వ జయంతి సందర్భంగా బృందావన్ గార్డెన్స్ లోని చైతన్య కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే కలలు కన్న సమాజం సాధించేందుకు యువతరం ముందుకు రావాలని ముఖ్యంగా ఆడపిల్లలు చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న అనేక విషయాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులను వెనకటి రోజుల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఆ ప్రయత్నాన్ని వ్యతిరేకంగా పోరాడేందుకు విద్యార్థులంతా ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర గర్ల్స్ కన్వీనర్ పద్మ, కళాశాల ప్రిన్సిపల్ స్టాఫ్ విద్యార్థులు పాల్గొన్నారు



గుంటూరు సిపిఎం కార్యాలయంలో మాట్లాడుతున్న పాశం రామారావు



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యం నిర్వహించిన సభలో సభలో మాట్లాడుతున్న కె.పద్మ

తాడేపల్లి : సామాజిక విప్లవ కారిణి - చదువుల తల్లి సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమం పట్టణంలోని కొత్తూరులో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్షులు దొంతిరెడ్డి విజయ లక్ష్మి, బాలల సంఘం పట్టణ బాద్యులు మౌనిక టీచర్, మరియు గీతారాణి, బాలమ్మ, డి. శ్రీనివాసకుమారి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.